ముందని రెట్టించబడింది. అది ప్రజల సమస్యలు తెలుసుకోడంలో అసమర్థురాలు కావచ్చు. కాని దాన్ని విషయంలో క్షమించాలి, ఎంచేతనంటే, ప్రజలసమస్యలు ఏ మనిషికీ తెలియనంతటి చిక్కుల్లో వున్నాయి. ఢిల్లీ హిందూదేశానికి రాజధానో, హిందూదేశం ఢిల్లీకి రాజధానో తెలీదు. అయినా దాన్ని క్షమించాలి. కారణం అది భూగోళం ఎప్పుడూ చదవలేదు. ఈ ఉపన్యాసాల ప్రభావంవల్ల ఇదివరకు కచూమర్‌మల్‌ని వట్టి బొగ్గువ్యాపారస్థుడే అనుకొనే చాలమంది ఆయన్ని సర్వశ్రేష్ట రాజనీతిజ్ఞునిగా భావించడం మొదలెట్టారు. వాళ్ళలో చాలమంది బొగ్గులవీ ఈయన వద్దనే కొనటం మొదలెట్టారు.

శేట్ కచూమర్‌మల్‌కి పోటీగా ఇద్దరభ్యర్థులే ఉండేవారు. ఎన్నికలికి కొన్ని రోజులముందు మున్షీ కలమ్ దీన్ 'కలమ్' ఒకణ్ణి విరమించుకొని చూడడానికి రాజీ చేసేశారు. విరమించుకోడానికి కారణం ఏమిటంటే మున్షీ గారతనికి, 'ఒకవేళ మీరు గెలిస్తే కర్రగుడ్లగూబ ఓడించేసిందని అంతా వేళాకోళం చేస్తారు' అని తెలియజేశారు.

రెండో అభ్యర్థి చివరి వరకూ నిలబడ్డాడు. ఎంచేతనంటే అతను దృఢప్రకృతి గలవాడు. అతనికి శేట్‌గారిలో ఎనిమిదోవొంతు ఓట్లొచ్చాయి, పాపం డిపాజిట్టు పోయింది. అతను శిక్షితుడు, రాజనీతి తెలుసు, బహుశా ప్రజాసేవకూడా చేయగలడు, ఇవన్నీ వాస్తవమే! కాని ఆ అభాగ్యుడు చేసిన తప్పేమిటంటే తన గుర్తు హుమ్మా (ఒక ప్రసిద్ధపక్షి. ఇది వట్టి దుమ్ములు తింటుందని, ఎవడి నెత్తిమీదైనా దీని నీడపడితే వాడు రాజైపోతాడనీ చెబుతారు) ఎంచుకున్నాడు. మన దేశంలో కర్రగుడ్లగూబ ముందు హుమ్మానెవడూ లెక్కచేయడని మీకు తెలుసుగా?

---

స్కెచ్

# సంతాప సభ

## వి. ఎన్. ఆచార్య

అప్పుడే నిద్రలేచి కాఫీతాగి వరండాలో కూచుని పేపర్ చదువుతున్నాను.

పంచాయతీ బోర్డు ప్యూన్ ముసలయ్య వాకిట్లోవచ్చి నిలబడ్డాడు.

"ఏం ముసలయ్యా" అని పలకరించాను. యాభైఏళ్ళ మనిషి కాస్తా ఏడుస్తూన్నట్టుంటే ఏదో గొప్ప కష్టాల్లో చిక్కుకున్నాడనే నా ఆదుర్దా.

"ఏమీలేదు సార్! మన వూరికి గొప్ప కష్టం వచ్చింది సార్. లేకుంటే అంతటి మగాణ్ముడు వున్న పళంగా చచ్చి పోడుసార్. అంత మా రాజు మళ్ళీ ఎక్కడ పుడతాడుసార్ ఈ దరిద్రం కొంపలో!" అని ఎంతో బాధపడుతూ అన్నాడు ముసలయ్య.

నాకు గుర్తొచ్చింది. ఆ ముందు రోజు రాత్రి మా వూరిలో కల్లా షావుకారు భద్రయ్యగారు చచ్చిపోయారు.

"అవును ముసలయ్యా! మ రే o చే స్తా రు." అన్నాను సానుభూతి కూడా కనబరుస్తూ.

"మిమ్మల్ని మా పెసిడెంటుగోరు పిలుచుకు రమ్మన్నారు సార్" అన్నాడు ముసలయ్య.

నాకు ఆశ్చర్యమూ, ఆదుర్దా కలిగింది. మా పంచాయతీబోర్డు ప్రెసిడెంటు చలమయ్యగారంటే అంత పలుకుబడిగల ఆసామీ.

"నన్ను పిలవడమెందుకు ముసలయ్యా?" అన్నాను ఆశ్చర్యంతో.

"అదేసార్! భద్రయ్యగోరి శవాన్ని ఈయాల దగనం చేస్తారట. మిమ్మల్ని రమ్మన్నారు." అన్నాడు ముసలయ్య.

నేను ఆశ్చర్యంతో ఏమీ అర్థంకాని పరిస్థితిలో ముసలయ్య వెంట వెళ్ళాను.

ప్రెసిడెంటు చలమయ్యగారు నేను వెళ్ళేసరికి ఎవరో పాకీవాళ్ళమీద నిప్పులు కక్కుతున్నాడు.

నేను వెళ్ళేసరికి వాళ్ళని అలా వదిలేసి "రండి! మీకోసం ఎదురుచూస్తున్నాను" అన్నాడు.

లోపలికెళ్ళి కూర్చున్నాం.

"భద్రయ్యగారిలాంటి వ్యక్తి ఇంత అకస్మాత్తుగా అరవై సరిగ్గా పూర్తికాకముందే చనిపోవడం చాలా అన్యాయం!" అన్నాడు.

"అవును! అలాగే అనుకుంటాను. నన్నెందుకో రమ్మన్నారట?" అన్నాను.

"అదేనండీ! ఈ రోజు సాయంత్రం భద్రయ్యగారికి దహన సంస్కారాలు జరుపుతున్నాం. శవాన్ని వూరేగింపుగా తీసుకువెళ్తున్నాం. వూరేగింపు ఆఖరులో మీరు భద్రయ్యగారిని గురించి ఒక చక్కటి ఉపన్యాసం ఇవ్వాలి. చూడండీ ఎంత చక్కగా ఆయన గుణగుణాల్ని వర్ణించినా ఆయనకు మనం ఇంకా ఋణపడి వుంటాం"అంటూ భావోద్రేకంతో చిన్న ఉపన్యాసం ఇచ్చాడు ప్రెసిడెంటు చలమయ్యగారు.

నేనోదో ఒకటి రెండు నాటకాలైతే రాసి. రచయిత ననిపించుకున్నానుగానీ ఉపన్యాసం ఇవ్వటం చాతకాదు. అయినా అంగీకరించక తప్పదు.

"అలాగే ఇస్తానులెండి. కానీ భద్రయ్యగారిని గురించి కొన్ని వివరాలు ఇస్తే రాసుకుంటాను" అన్నాను పేపరు పెన్సిలూ తీసుకుంటూ.

"ఓ! మరిచిపోయాను. మీరు ఈ వూరికి కొత్తకదూ?" అంటూ పళ్ళికిలించి విశాలంగా నవ్వాడు ప్రెసిడెంటు చలమయ్య. ఆ కుర్చీలో అలాగే కూర్చుని కాసేపు నిదానంగా చుట్టపీల్చి "భద్రయ్యగారు ఈ వూళ్ళోకెల్లా డబ్బున్నవాడు. ఒకసారి నాతో ప్రెసిడెంటు పదవికి పోటీ పెట్టాలనుకున్నాడు. అంత డబ్బున్నవాడు నిలిస్తే మన పనేమయినా వుందా? కాళ్ళావేళ్ళా బ్రతిమిలాడి ఎలాగో మాన్పించాను!"

నేను కాగితంమీద భద్రయ్యగార్ని గురించి వివరాలు "గొప్ప ధనికుడు" అని రాసుకున్నాను.

ఆతర్వాత ప్రెసిడెంటు చలమయ్యగారు చాలాసేపు ఆలోచించాడు. చివరకి "చూశారూ! ఇలాంటి మీటింగులకు భద్రయ్యగార్ని గురించి చెప్పాలంటే అందుకు తగినవాడు షావుకారు వీరయ్యగారే. భద్రయ్యగార్ని గురించి నాకూ అంతగా తెలీదు. చూడండీ మాకేమంత పరిచయం కూడా లేదు..."

నేను ప్రెసిడెంటు చలమయ్యగారి దగ్గర్నుంచీ సెలవు పుచ్చుకొని షావుకారు వీరయ్యగారి దగ్గరకి వెళ్ళాను.

"పాపం! భద్రయ్యగోరు చాల మంచివారండీ! గొప్పగా డబ్బున్నవాడు. ఆయన దగ్గిర డబ్బు అప్పుచ్చుకోని ఘరానా మనిషి ఈ వూళ్లో లేడంటే నమ్మండి!" అన్నాడు షావుకారు వీరయ్యగారు.

"ఆ సంగతి ఇదివరకే రాసుకున్నానండీ. ఇంకా భద్రయ్యగార్ని గురించీ ఏమన్నా చెప్పండి."

"చెప్పడానికే ముందండీ! ఆయన ఈ వూళ్లో కెల్లా ధనికుడు చూడండీ. ఆయన్ను గురించి నాకూడా ఏమీ తెలీదు. కాంట్రాక్టర్.ఖాదర్ సాహెబ్‌గారు మీకు అన్ని చెప్తుతారు." అని పళ్ళికిలించి నవ్వాడు వీరయ్యగారు.

కాంట్రాక్టర్ ఖాదర్ సాహెబ్‌గారికూడా ఏమీ అంతగా అంటే ఉపన్యాసానికి ఉపయోగపడేవిధంగా భద్రయ్యగారి గుణగుణాల్ని గురించీ తేలీదు. ఆయన డాక్టర్ హెన్రీ దగ్గరకి వెళ్ళమన్నారు.

నేను వెళ్లేసరికి డాక్టరు హెన్రీగారు తోటలో తలక్రింద వుంచి కాళ్లు పైకియెత్తి కసరత్తు చేస్తున్నారు. నన్ను చూస్తూనే లేచి ఆహ్వానించారు.

"భద్రయ్యగారు, పాపం!" అన్నాను కుర్చీలో వచ్చి కూచుంటూ డాక్టర్ హెన్రీగారు "మూడు రోజుల క్రితమే చెప్పానండీ. పక్షవాతానికి చిక్కుడుకాయలు తింటే ఏమవుతుంది చెప్పండి?" అన్నారు డాక్టర్ హెన్రీ.

"అవును. పాపం! ఆయన మరణానికి మన గ్రామం అంతా విచారిస్తున్నది. దహన సంస్కారానికి ముందు ఒక చిన్న సంతాప సభ జరపలనుకొన్నారు. అందులో నన్ను ఉపన్యాసం ఇవ్వమన్నారు ప్రెసిడెంటు చలమయ్యగారు. ఆయన్ని గురించి వివరాలు ఏమన్నా..."

"అబ్బే! నాకట్టె వివరాలు తెలియవండీ ఆయ. గొప్ప ధనికుడు నా బిల్లు అప్పటికిప్పుడు ఇచ్చేస్తు వుంటాడు. మీకు ఆయన్నుగురించి చెప్పాలంటే హెడ్‌మాష్టర్ సీతారామయ్యగారి దగ్గిర

వెళ్ళాలి" అని డాక్టర్‌గారు నన్ను గేటుదాకా సాగనంపాడు.

హెడ్‌మాస్టర్ సీతారామయ్యగారి దగ్గిరకి వెళ్ళేటప్పటికీ మధ్యాహ్నం మూడు గంటలయింది నాకు భద్రయ్యగార్ని గురించి తెలిసిన వివరమల్లా ఆయన "గొప్ప ధనికుడు"

"ఆ మాటకొస్తే నేనే ఒక సంతాప సభజరిపి నా కృతజ్ఞతను వెలిబుచ్చా లనుకున్నానండీ ఇప్పటికైనా మించింది లేదు. శవం వూరేగింపుగా వెళ్లుతున్నప్పుడే మా స్కూలుదగ్గిర ఒక క్షణం ఆపి భద్రయ్యగారికి నా ఆఖరు అభినంద నాలు తెలుపుకుంటాను"అన్నాడు హెడ్‌మాస్టర్ సీతారామయ్య.

"అలాగే చెయొచ్చు. భద్రయ్యగారిని గురించి నాకొన్ని వివరాలు కావాలి!"

"వివరాలు...వివరాలు తెలుసుకోటానికి ఆ మాటకొస్తే నేనే కాంగ్రెసు పుల్లయ్యగారి దగ్గిరకి వెళ్ళాలనుకుంటున్నాను..."

నేను సీతారామయ్యగారితో అట్టే కాలం వృథాపుచ్చక కాంగ్రెసు పుల్లయ్యగారి దగ్గిరకి వెళ్ళాను.

"1942 ఉద్యమంనుండీ మొన్న జరిగిన ఎనిమిదవ స్వతంత్ర దినోత్సవందాకా ఆయన అన్ని మీటింగులకూ డబ్బులిచ్చేవారు గొప్ప డబ్బున్నవాడు ధనికుడు.." అంతకంటే కాంగ్రెసు పుల్లయ్యగారు ఏమీ వివరాలు ఇవ్వలేదు. "మీరు పంచాయతీబోర్డు ప్రెసిడెంటు చలమయ్యగారి దగ్గిరకి వెళ్ళండి ఆయన అన్నీ చెప్తాడు!" అని సలహా ఇచ్చారు. కాంగ్రెసు పుల్లయ్యగారు.

చలమయ్యగారిదగ్గిరకి వెళ్ళితే మళ్ళీ రేపటి దాకా ఇప్పుడు వెళ్ళివచ్చిన వాళ్ళందరిదగ్గిరకీ తిరగాలి. సాయంత్రం సంతాప సభా దాహన సంస్కారం.

ఇంతలో ఒక పెద్ద వూరేగింపు భద్రయ్యగారి శవాన్ని మోసుకుని వెళ్ళుతున్నది. అందులో నేను ఇంతవరకూ కలుసుకొని వచ్చినవారంతా ముందు నిల్చుని వున్నారు.

నేను పక్కకితప్పుకున్నాను. నేనేం ఉపన్యాసం ఇవ్వాలి?

నా కాగితంలో 'భద్రయ్యగారు గొప్పధనికుడు' మినహాయించి ఇంకేవివరమూ చేరలేదు!

(ఒక యుగోస్లావ్ కథ ఆధారం)

★

గేయం

## కలహాంతరిత

శశాంక

వలచివచ్చిన హృదయమిచ్చి పలుకనైతి
విసిగి మాధవుడిపుడు వెడలినాడెక్కడికొ!

విరిదండ సిగదురుమ
సరస జేరెనుగాని
విరసముగ త్రెవ్వేరిచి
నే పరాఙ్ముఖినైతి!

వలచివచ్చిన హృదయమిచ్చి పలుకగనైతి
విసిగి మాధవుడిపుడు వెడలినాడెక్కడికొ!

చుబుకమ్ము చేద్రిప్పి
బ్రతిమాలుకొనెగాని
పాడుకోపమువిడచి
పలుకాడలేనైతి!

వలచివచ్చిన హృదయమిచ్చి పలుకగనైతి
విసిగి మాధవుడిపుడు వెడలినాడెక్కడికొ!

గట్టిగా కౌగిటను
బట్టి గ్రుచ్చెనుకాని
పరుసాన బడిపోయి
బలిమి పోద్రోసితిని!

వలచివచ్చిన హృదయమిచ్చి పలుకగనైతి
విసిగి మాధవుడిపుడు వెడలినాడెక్కడికొ!

గడియ సైషగలేని
వలపు నాయెడదాచి
బయలకీ కోపమును
భగవానుడిటులిచ్చె!

వలచివచ్చిన హృదయమిచ్చి పలుకగనైతి
విసిగి మాధవుడిపుడు వెడలినాడెక్కడికొ!